www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -284 ఆదివారం 29 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు




- నిగమ్‌బోధ్ ఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్
- ప్రధాని మోడీ, మంత్రులు, స్పీకర్ తదితరులు
- కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఘాట్ వరకు అంతిమయాత్ర



న్యూఢిల్లీ,/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
ఇక సెలవ్ అంటూ ఆర్థికవేత్త మన్మోహన్ నింగికేగారు. దివంగత మాజీ ప్రధానికి వీడ్కోలు పలికారు. దివికేగిన దివంగత నేతకు ప్రముఖులు కడసారి శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు.మిగతాది 2లో...

## ఫార్ములా ఈ-రేసు కేసు
# కెటిఆర్‌కు ఇడి నోటీసులు




హైదరాబాద్,/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

# బడుగుల గళం పీజేఆర్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళి



హైదరాబాద్,/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన వ్యక్తి మాజీ మంత్రి పి.జనార్దన్ రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా ఆయన పని చేసిన ఆయన నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం తెలిపారు. కాగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం రోజే పిజెఆర్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు.

# 31న దావత్‌లు బంద్ చేసుకోండి

- ఆ డబ్బులతో హాస్టళ్లను దత్తత తీసుకోండి
- యువతకు హరీష్ రావు పిలుపు
- మెజ్ ఛార్జీలు ఆపారంటూ సర్కార్‌పై విమర్శలు



హైదరాబాద్/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
యువత ముందుకు వచ్చి హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే.. మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నారు. .మిగతాది 2లో...

## కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం యేడాదిలోనే సాధించిన అద్భుత విజయం

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించే రోజు
నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..




4లో.

# ఆర్‌ఆర్‌ఆర్ కు టెండర్లు

## 161 కిలోమీటర్ల నిర్మాణం

రూ. 7104 కోట్ల వ్యయం
నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు తొలిఅడుగు



హైదరాబాద్/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
హైదరాబాద్ ప్రాంతీయ రింగు రహదారి(ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణ ప్రక్రియ ఇక పరుగులు పెట్టనుంది. శనివారం జాతీయ రహదారుల శాఖ(ఎన్‌హెచ్ఏఐ) టెండర్లను ఆహ్వానించింది. రూ. 7104.06 కోట్లతో 161.5కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ను నిర్మించాలని నిర్ణయించింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఐదు ప్యాకేజీలుగా చేపట్టనున్న ఈ పనులను రెండేండ్లలో పూర్తిచేయనున్నారు. అలాగే నిర్మాణ అనంతరం ఐదేండ్లపాటు నిర్వహణ కూడా చేయాల్సి ఉంటుందని టెండర్ల మార్గదర్శకాల్లో స్పష్టంచేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీవరకు టెండర్ల దాఖలుకు గడువిచ్చారు. ఫిబ్రవరి 17న టెండర్లు తెరుస్తారు. ఆన్‌లైన్ పద్ధతిలో టెక్నికల్, ఫైనాన్స్ బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించిన సంస్థలకు సంబంధించిన ఫైనాన్స్ బిడ్లను మాత్రమే తెరుస్తారు. అంతిమంగా తక్కువ ధర కోట్ చేసిన సంస్థకు కాంట్రాక్టు పనులు కేటాయిస్తారు. తొలుత సంగారెడ్డిలోని గిర్మాపూర్ నుంచి తంగడపల్లి వరకు ఉత్తర భాగం రహదారిని నిర్మించనున్నారు. భూసేకరణలో సమస్యల వల్ల చాలాకాలంగా టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్న విషయం విదితమే..మిగతా 2లో...

# జనవరి 1 నుంచి అమల్లోకి భూ భారతి

- డిసెంబర్ 31తో కాలం చెల్లిపోనున్న ధరణి పోర్టల్
- భూ భారతి పోర్టల్‌ను నిర్వహించనున్న ఎన్ఐసీ
- ధరణి డేటాను ఎన్ఐసీకి బదిలీ చేయనున్న టెర్రాసిస్




డిసెంబర్ 28,ప్రజావినికిడి:
భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌కు ఈ నెల 31తో కాలం చెల్లిపోనుంది. ధరణి పోర్టల్ నిర్వహణను టెర్రాసిస్ చూస్తోంది. ఈ గడువు కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ క్రమంలో కొత్త ఏడాది నుంచి భూ భారతి పోర్టల్ అమల్లోకి రానుంది.
భూ భారతి పోర్టల్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) పూర్తిస్థాయిలో నిర్వహించనుంది. ధరణి పోర్టల్ పూర్తి డేటాను టెర్రాసిస్ సంస్థ ఎన్ఐసీకి బదిలీ చేయనుంది. డేటా బదిలీ పూర్తయ్యాక భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలుస్తోంది.

# అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 15 బృందాలు

- కొత్త ఏడాదిలో మరింత దూకుడు
- ఆక్రమణలన్నీ రికార్డు చేస్తున్నాం
- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

హైదరాబాద్,/డిసెంబర్ 28,ప్రజావినికిడి:
కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టంచేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు..
మిగతాది 2లో...



# అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 15 బృందాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎల్టిఎఫ్ నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం' అని రంగనాథ్ వెల్లడించారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. శనివారం హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. ఈ÷ుఒ, బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ ఈఒ రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు. డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్షఖీఖీ వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు. 'హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. హెచ్ఎండిఏ వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది. 1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి' అని రంగనాథ్ పేర్కొన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్ కు టెండర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికి ఇంకా ఐదు శాతం వరకు భూసేకరణ పెండింగ్‌లోనే ఉంది. యాదాద్రి, రాయగిరి ప్రాంతాల్లో భూసేకరణను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినా ఎన్‌హెచ్ఏఐ టెండర్లను పిలవడం గమనార్హం. %ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి అప్పటి గత సర్కారు హయాంలోనే అంకురార్పణ జరిగింది. హైదరాబాద్‌కు సుమారు 50కిలోమీటర్ల దూరంలో ఔటర్ రింగురోడ్డుకు, సమాంతరంగా మరో రింగురోడ్డు నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. దీనికి అవసరమైన అలైన్‌మెంటును రూపొందించి కేంద్రానికి పంపింది. ఆ తర్వాత కేంద్రం ఆమోదించింది. కాగా భూసేకరణలో కొంత జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు తదుపరి భూసేకరణకు చేపట్టింది. దక్షిణభాగానికి నో టెండర్! ముందుకురాని కన్సల్టెంట్లు రీటెండర్లకు ఆహ్వానానికి ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాలనుకుంటున్న ట్రిపుల్ దక్షిణ భాగం సమగ్ర ప్రాజక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి కన్సల్టెంటు సంస్థలు ముందుకు రాలేదు. గ్లోబల్ టెండర్లు ఆహ్వానించి, నెల రోజుల గడువిచ్చినా ఒక్క సంస్థ కూడా ముందుకు రాకపోవడంతో సోమవారం మళ్లీ టెండర్లు ఆహ్వానించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులు జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో చేపడుతుండగా, దక్షిణ భాగం పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించిన విషయం విధితమే. ఇందులో భాగంగా దక్షిణ భాగం కోసం గతంలో రూపొందించిన అలైన్‌మెంటులో మార్పులు చేసిన ప్రభుత్వం, దీనికి అవసరమైన సమగ్ర ప్రాజక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు నవంబర్ 25న గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. శనివారం టెండర్లు తెరవగా, ఒక్క టెండరు కూడా దాఖలు కాకపోవడం గమనార్హం. సోమవారం రీటెండర్ చేయనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

# మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు



(మొదటి పేజీ తరువాయి)




త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

## బొకేల బదులు..పుస్తకాలు ఇవ్వండి

### బుక్ఫెయిర్ సందర్శించిన గవర్నర్



హైదరాబాద్,/డిసెంబర్ 28,ప్రజావినికిడి: శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. 'పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి' అని గవర్నర్ సూచించారు.

## ఈ కార్ రేసులో ప్రభుత్వ ధనం దుర్వినియోగం

### కెటిఆర్‌కు ఈడి నోటీసులపై ఎంపి రఘునందన్ రావు



హైదరాబాద్,డిసెంబర్ 28,ప్రజావినికిడి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు.. కేటీఆర్ ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ఫార్ములా ఈ కార్ రేస్ ఎలా నిర్వహించారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ఒక్క రూపాయి ఖర్చు చేసిన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.. ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు ఆర్బీఐకి చెప్పకుండా మన రాష్ట్ర సొమ్మును దేశ ఫారెన్ కంపెనీల కోసం ఖర్చు పెట్టారని రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి ఈడీ నోటీసులపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. అందుకే కేటీఆర్ పై ఈడీ కేసు నమోదవుతుంది.. విచారణను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుందనితెలిపారు. ఈడీ, మోడీ, బోడి అని నోరు పారేసుకునే టప్పుడు నోరు, ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకుంటే మంచిదని కేటీఆర్ కు రఘునందన్ రావు హెచ్చరించారు. గతంలో ఎమ్మెల్సీ కవిత కూడా ఇలానే మాట్లాడిందని తెలిపారు. తనను అరెస్ట్ చెయ్యి అని ట్విట్టర్‌లో పెట్టిన టిల్లు.. కేసు కాగానే కోర్టుకి వెళ్ళాడని విమర్శించారు. ధైర్యముంటే కేటీఆర్ జైలుకి వెళ్ళాలి.. జైలు లోపల ఎలా ఉంటుందో చూసి రావాలని రఘునందన్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా.. ఫార్ములా ఈ-కార్ కేసులో కేటీఆర్ పై ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.. ఫార్ములా ఈ-కార్ రేసులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్, ఫెమా ఉల్లంఘన కింద ఈడీ, ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసులో ప్రమేయం ఉన్న కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదు చేసింది.

# 31న దావత్‌లు బంద్ చేసుకోండి

సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ బ్రిడ్జి స్కూల్‌లోని విద్యార్థులకు స్వెట్లర్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు. చలికాలంలో హాస్టల్‌లో వేడి నీళ్ల రాక, ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. గత 4 నెలల నుంచి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదని శాసనసభ సాక్షి గా చెప్పారని ప్రస్తావించారు. ఇదేనా గ్రీన్ ఛాలెంజ్ అని ప్రశ్నించారు. జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన మీద పట్టు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుందని చెప్పారు. అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి, తులం బంగారం ఎటు పోయాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారా అని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదా అని నిలదీశారు. తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని నిలదీశారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీ విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300కి పెంచిన మెస్ ఛార్జిలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1,050 మెస్ ఛార్జిలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 7 తరగతి వరకు 1300, ఎనిమిదో తరగతికి రూ.1500 మెస్ ఛార్జిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ ఛార్జిలు ఇంకా 100 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని.. వాటిని150 రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ విషయంలో కూడా మాట నిలుపుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఏ విషయంలోనూ చెప్పిన మాటకు క్షేత్రస్థాయిలో పొంతన లేదని అన్నారు. అసెంబ్లీ లో చెప్పినట్లుగా తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం యేడాదిలోనే సాధించిన అద్భుత విజయం

### తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించే రోజు

### నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..

(హైదరాబాద్):డిసెంబర్ 28,ప్రజావినికిడి:
5 ప్యాకేజీలుగా హైదరాబాద్ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు.టెండర్లు పిలిచిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ27.12.2024 నుంచే అందుబాటులోకి వచ్చిన టెండర్ల దాఖలుకు చివరి తేదీ 14.02.2025 (11.30 గంటల) 14.02.2025 తేదీన టెండర్లు తెరవనున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ.. ఆర్ఆర్ఆర్ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి అనేకసార్లు కేంద్ర రోడ్డు రవాణ,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతులు సమర్పించాను.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. 2017 లో రీజినల్ రింగ్ రోడ్డు ప్రతిపాదించినా..గత ప్రభుత్వ నిర్లక్ష్యం వెనకబడ్డ పనులు

2023 డిసెంబర్ లో పదవీ చేపట్టిన నాటి నుంచి రీజినల్ రింగ్ రోడ్డు కోసం నిరంతరం కృషి చేశా - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి భూసేకరణపై అనేక సార్లు కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాం - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓఆర్ఆర్ గేమ్ ఛేంజర్ అయితే, ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్ ఛేంజర్ కాబోతున్నది.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.తెలంగాణ అభివృద్ధిలో ఆర్ఆర్ఆర్ కీలక భూమిక పోషించబోతున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి చేసిన కృషి ఫలించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితెలంగాణలో గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రీజినల్ రింగ్ రోడ్డు పనులు ఆలస్యం అయ్యాయి.అప్పుడే యుటిలిటీ ఛార్జీలు




చెల్లిస్తామని లేఖ ఇచ్చుంటే ఈపాటికి రీజినల్ రింగ్ రోడ్డు పట్టాలెక్కేది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మా ప్రభుత్వం వచ్చాకా నేను స్వయంగా ముఖ్యమంత్రిగారిని రిక్వెస్ట్ చేసి యుటిలిటీ ఛార్జీల చెల్లిస్తామని లేఖ రాశాం.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిరాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని వివరిస్తే.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పెద్ద మనసు చేసుకొని యుటిలిటీ ఛార్జీలు కూడా కేంద్రమే చెల్లిస్తుందని హామి ఇచ్చారు.

## టెండర్ వివరాలు

**1వ ప్యాకేజీ:**
గిర్మాపూర్ గ్రామం నుంచి రెడ్డిపల్లి గ్రామం వరకు 34.518 కిలోమీటర్లు నాలుగు వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని %-% 1529.19 కోట్లతో రెండు సంవత్సరాల నిర్మాణ సమయం, 5 సంవత్సరాల మొయింటెనెన్స్.

**2వ ప్యాకేజీ:**
రెడ్డిపల్లి గ్రామం నుంచి ఇస్లాంపూర్ గ్రామం వరకు వరకు 26 కిలోమీటర్లు నాలుగు వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని %-% 1114.80 కోట్లతో రెండు సంవత్సరాల నిర్మాణ సమయం, 5 సంవత్సరాల మొయింటెనెన్స్.

**3వ ప్యాకేజీ:**
ఇస్లాంపూర్ గ్రామం నుంచి ప్రజ్ఞాపూర్ వరకు వరకు 23 కిలోమీటర్లు నాలుగు వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని %-% 1184.81 కోట్లతో రెండు సంవత్సరాల నిర్మాణ సమయం, 5 సంవత్సరాల మొయింటెనెన్స్.

**4వ ప్యాకేజీ:**
ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి గ్రామం వరకు వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని %-% 1728.22 కోట్లతో రెండు సంవత్సరాల నిర్మాణ సమయం, 5 సంవత్సరాల మొయింటెనెన్స్.

**5వ ప్యాకేజీ:**
రాయగిరి గ్రామం నుంచి తంగడ్ పల్లి గ్రామం వరకు వరకు 35 కిలోమీటర్లు నాలుగు వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని %-% 1547.04 కోట్లతో రెండు సంవత్సరాల నిర్మాణ సమయం, 5 సంవత్సరాల మొయింటెనెన్స్.

**అదనపు సమాచారం :**
5 ప్యాకేజీలుగా నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంపొడవు.. 161.518 కిలోమీటర్లు,ఈ రోడ్డు నిర్మాణానికి 7,104.06 కోట్ల రూపాయలు మంజూరీ చేసిన కేంద్ర ప్రభుత్వం.అని అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 డిసెంబర్ 2024

# మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు..

### డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్




ప్రజావినికిడి, (నాంపల్లి): మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్ (ముజీబ్) అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్ (ముజీబ్) జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కుమార్ తో కలిసి మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ నేడు భారత దేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందంటే దానికి కారణం స్వర్గీయ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.తొంభైవ దశకంలో వేసిన పునాదులని, అనుక్షణం దేశం కోసం పరితపించిన దేశభక్తుడన్నారు. మన్మోహన్ సింగ్ లాంటి మహామేధావి మరణం దేశానికి తీరని లోటని,అయన స్థానాన్ని భర్తీ చేయడం ఎవరివల్ల కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు కే.ఆర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్,సభ్యులు ఖాలెద్ అహ్మద్,వైదిక్ శస్త్ర, శ్రీధర్,ముఖీమ్ ఖురేషి, కేంద్ర సంఘం సభ్యులు శంకర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ సభ్యులుఎం ఏ రహీం,ఎన్ టి అధ్యక్షులు రాజు, ఎక్సయిజ్ సభ్యులు కృష్ణ, గ్రంధాలయ సంస్థ సభ్యులు అయోధ్య, వర ప్రసాద్, మహేందర్,సుఖేష్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ సభ్యులు నజీర్ పి ఆర్ ఓ జహంగీర్,ఏ పి ఆర్ ఓ మహమ్మద్ వహీద్,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# సంస్కరణ యోధునికి చిత్ర నివాళి..

### భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు చిత్ర రూపంలో నివాళులర్పించిన కర్నూలు నగరానికి చెందిన చిత్రకారుడు పెరుమాళ్ళ వాసు..





ప్రజావినికిడి,(కర్నూలు):డిసెంబర్ 28: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని,ఆయన లేని లోటు తీర్చలేనిది అని,భారత దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పదేళ్ల పాటు ఆయన చేసిన కృషి దేశం గర్వించదగినదని కర్నూలు నగరానికి చెందిన చిత్రకారుడు పెరుమాళ్ళ వాసు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిగర్వి, మౌనముని గా పేరొందిన మన్మోహన్ మృతి యావత్ భారత దేశం జీర్ణించుకోలేక పోయింది.దేశంలో ఒక తరానికి ఆయన అందించిన అభివృద్ధి ఫలాలు మరువలేనివి. దేశం గర్వించదగ్గ ప్రధానుల్లో మన్మోహన్ సింగ్ ప్రధమంగా వుంటారు.ఒక చిత్రకారునిగా నా కౌమార్య దశ నుంచి నాకు ప్రధాని అంటే మన్మోహన్ సింగ్ అనే గుర్తు...ఆయన వల్లే ప్రతీ రంగం మరీ ముఖ్యంగా కళారంగం చాలా అభివృద్ధి సాధించింది.సోనియాగాంధీ నిర్దేశత్వం లో మన్మోహన్ సింగ్ దేశ ప్రజలలో చెరగని ముద్ర వేశారు.ఆయన మృతికి ఒక చిత్రలేఖన కళాకారుడిగా ఆయనకు ఇదే సరైన నివాళి అని పేర్కొన్నారు.

# జగద్గురువు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఆవిష్కరణ

### విగ్రహ కమిటీ అధ్యక్షులు మీర్ పేట 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి..





ప్రజావినికిడి,(మహేశ్వరం): మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెల్ల గూడ చెరువు కట్టపై జగద్గురువు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఆవిష్కరణ శనివారం ఉదయం 11 గంటలకు బ్రహ్మంగారి మఠం వారి వంశ వారసుడు ఎనిమిదవ తరం వారసులు వీరభద్ర స్వాములవారి కర కమలములచే నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మొదటి స్పీకర్ మధుసూదనా చారి,పట్టణ మౌలిక అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, మాజీ బీసీ జాతీయ సభ్యులు ఆచారి, మహేశ్వరం నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర నాయకులు అందేల శ్రీరాములు యాదవ్, కోలన్ శంకర్ రెడ్డి మీర్పేట్ మేయర్ దుర్గ దీప్ లాల్ చోవన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి బడంగ్పేట్ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి మీర్పేట్ కమిషనర్ జ్ఞానేశ్వర్ స్వామి వారి భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, వీరబ్రహ్మేంద్రస్వామి వారి నామస్మరణతో చెరువు కట్ట మారు మ్రోగడం జరిగింది. సుమారు 400 సంవత్సరాల క్రితం ప్రపంచంలో జరగబోయే వింతలన్నీ కాలజ్ఞాన రూపంలో తెలియపరచిన మహానుభావుడని దళిత సామాజిక వర్గానికి చెందిన కక్కయ్య కి అదేవిధంగా దూదేకుల కులానికి చెందిన సిద్ధప్పని శిష్యునిగా చేర్చుకొని గరిమిరెడ్డి అచ్చమాంబ రెడ్డి దంపతులకు కాలజ్ఞానాన్ని బోధించి కాలజ్ఞానం అన్ని కులాలు సమానమేనని ఆనాడే తెలియచేసిన మహానుభావులను తెలియజేశారు. ఇంతటి మంచి కార్యక్రమం చేసిన కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

### అయ్యప్ప స్వాములకు,భక్తులకు అన్నదానం చేసిన చేగు భద్రప్ప..

### ఆంజనేయస్వామి దేవాలయ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన 6వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలం గౌడ్..





ప్రజావినికిడి,(షాద్ నగర్): రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో,భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది.ఆలయ ప్రధాన అర్చకులు రాఘవేంద్ర చార్య, అర్చకులు ప్రమోద్, సునీల్ పంతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను 6వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలం గౌడ్,ఎంసాని రమ నర్సింలు ఆధ్వర్యంలో భజన భక్త బృందం సభ్యులు భక్తుల సమక్షంలో ఆవిష్కరించి అందరికీ అందజేశారు. అదేవిధంగా ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్నం గోపాల్ రెడ్డి దేవాలయంలో అన్నదానానికి పదివేల రూపాయలు విరాళం అందజేశారు. అనంతరం షాద్ నగర్ పట్టణానికి చెందిన చేగు భద్రప్ప దేవాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు,భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ఆంజనేయ స్వామికి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిస్వాములకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్ గౌడ్,న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి, పులిమామిడి శ్రీశైలం గౌడ్,ఎంసాని నరసింహులు,గూదే వసంతరావు,గూనెల్లి రమేష్,అశోక్ గౌడ్, బాల్ రెడ్డి,సికేరా రమేష్,అన్నారం రఘు గౌడ్,రఘునందన్ రెడ్డి, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ,వీర్లపల్లి కృష్ణయ్య,లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి,పి.ప్రవీణ్ గౌడ్,పద్మా వెంకటేష్, గోరియా నాయక్,కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్,రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్ ప్రజా వినికిడి రిపోర్టర్ మల్చలం రాము,మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,భజన భక్త బృందం,మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# నాయకులను.. పాలకులను.. అధికారులను.. ముచ్చెమటలు పట్టిస్తున్న ఈడీ అలాగే పోలీస్ కేసులు..

### పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ..




ప్రజావినికిడి,(ఎల్బీనగర్): చట్టము తన పని తాను చేసుకపోతుంది. అదేవిధంగా ప్రకృతికి మనము ఏది ఇస్తామో, అదే మనకు తిరిగి వచ్చును. నాయకులు,అధికారులు,పాలకులు ప్రజలకు ఏ దిశానిర్దేశంచేస్తున్నారు. ఎలాంటి జీవితాలను ఇస్తున్నారు.మనకు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎందరో నాయకులు, అధికారులు, పాలకులు ఇష్టారీతిన ప్రవర్తించి,అపనిందల పాలై పోలీస్ స్టేషన్ల చుట్టూ,కోర్టుల చుట్టూ,జైళ్ళ చుట్టూ తిరిగిన వారిని, తిరుగుతున్న వారిని మనము ఎందరినో చూశాము,ఇంకా చూస్తున్నాము కూడాను.అయిననూ నాయకులు,పాలకులు, అధికారులలో మార్పు రాకపోవటము నిజంగా విచారకర విషయమే(పాలకుల, అధికారుల,నాయకుల పేర్ల ప్రస్తావన అవసరం లేదనుకుంటాను.) అధికారము ఉంది కదాని విర్రవీగుతే, భవిష్యత్తు అధోగతే అని నాయకులు, అధికారులు, పాలకులు అర్థం చేసుకుంటే మంచిది.ప్రజలు అధికారము ఇచ్చారు కదాని,ఇక ఎదురేలేదు,తిరుగే లేదని విర్రవీగి అధికార దుర్వినియోగానికి పాల్పడినా,డబ్బు మదంతో విచ్చలవిడిగా ప్రవర్తించినా,ఎంతటి హోదాలో ఉన్న వారైనా భవిష్యత్తులో పశ్చాత్తాపం, ప్రాయశ్చిత్తం చేసుకోక తప్పదు.ఎలాంటి వారైనా అవినీతికి, అన్యాయానికి, దోపిడీకి,అక్రమాలకు పాల్పడితే ఎదురయ్యే పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయని, ప్రస్తుతము "ఈడీ అదేవిధంగా పోలీస్" కేసులను ఎదుర్కొంటున్న నాయకులకు, అధికారులకు, పాలకులకు అర్థమై ఉంటదని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానంద రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాడు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి,అక్రమాలు, అధికార దుర్వినియోగాలు భవిష్యత్తులో ఎంతటి వారినైనా,పట్టి పీడిస్తూ,వదలవు అనే దానికి,ప్రస్తుతము పోలీస్ కేసులను ఎదుర్కొంటున్న వారే ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చును. అధికారం ఉన్నప్పుడు ఏమి చేసినా,ఎవరూ ఎదిరించే సాహసం చేయకపోవచ్చు,కానీ అధికారం కోల్పోయిన మరుక్షణమే,దారిన పోయే దానయ్యలు కూడా వెక్కిరిస్తారు. కేసులు పెడతారు. నిందలు వేస్తారు. అపనిందల పాలు చేస్తారు,అశాంతికి గురిచేస్తారు.ఇక ఆ తర్వాత నిద్రలేని రాత్రులే మిగులుతాయి. కావున అధికార దుర్వినియోగము, స్కాములు,అవినీతి, మనీలాండరింగ్ లాంటి వాటికి దూరంగా ఉండటమే అత్యుత్తమము. ఒకవేళ ఏమైతదిలే, ఎదురు చెప్పేవారెవరు అనే అహంకార ధోరణితో,అధికార మదంతో ఎలాంటి తప్పిదాలు చేసినా, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలకు బాధ్యత వహిస్తూ, తప్పక సమాధానము చెప్పవలసి ఉంటుంది. కావున అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా, అవినీతికి, స్కాములకు తావు లేనటువంటి పరిపాలనను ఇస్తూ, ప్రజలకు ఆదర్శవంతంగా, నీతివంతంగా, జవాబుదారీతనంతో ఉండాలని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షులు సదానంద రెడ్డి నాయకులను, అధికారులను, పాలకులను మీడియా ముఖంగా ప్రజల తరఫున హెచ్చరిస్తున్నాడు. కావున వారు ఇప్పటికైనా మారాలని కోరుకుంటూ,అందరినీ ఆలోచించమని సూచిస్తున్నాడు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న రాజ్ కుమార్ రెడ్డి..





ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఆపదలో ఉన్న పేదవారికి అభయ హస్తాన్ని అందిస్తూ పేదల గుండెల్లో గుడి కట్టుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు గౌరవ డాక్టరేట్ ను శనివారం తమిళనాడులోని వసూర్ లో అందజేశారు.డాక్టరేట్ ను అందుకున్న కె.రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పేదరికంతో బాధపడుతున్న వారికి చేయూతనందిస్తూ, విద్య,ఉద్యోగ,ఉపాధి రంగాల్లో యువతను ప్రోత్సహిస్తూ విశేష సేవలు అందిస్తున్నామని తెలిపారు.తాము చేస్తున్న సేవలను గుర్తించి ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు గౌరవ డాక్టరేట్ ను అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ గౌరవ డాక్టరేట్ తో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.సేవా కార్యక్రమాలు చేపట్టడంలో తనకు ప్రోత్సహించిన ఫౌండేషన్ సభ్యులకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు రాజ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# భవిష్యత్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మరు..

## స్థానిక సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటబోతుంది..

## "నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి" బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహబూబాబాద్ సంస్థాగత ఎన్నికల ఇంచార్జి..

## మహబూబాబాద్ సంస్థాగత ఎన్నికల సమావేశంలో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..

ప్రజావినికిడి,(మహబూబాబాద్):
స్థానిక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిధి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహబూబాబాద్ సంస్థాగత ఎన్నికల ఇంచార్జి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.ఇందులో భాగంగా మెంబర్ షిప్ కమిటీలను పూర్తిగా సమీక్షించారు.వారితో పాటు జిల్లా అధ్యక్షులు వైవి రావు, రాం చందర్ రావు మాజీ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,సీతయ్య, వల్లబ్ వెంకట్, ధర్మరపు వెంకన్న, సురేందర్, మురళి,హిందూ భారతి,లక్ష్మణ్ నాయక్,చీకటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయం కోసం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చి,మొండి చేయి చూయించిందని,భవిష్యత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని ప్రజలు నమ్మరని అన్నారు.అదేవిదంగా బీఆర్ఎస్ పార్టీ కి తెలంగాణా లో స్థానం లేదని అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటబోతుందని అన్నారు.
మోడీ గారి ప్రభుత్వం గత పదేళ్లుగా అణగారిన వర్గాల అభివృద్ధి కోసం,దేశ అభివృద్ధియే లక్ష్యం గా పని చేస్తుందని అన్నారు.2047 వరకు అభివృద్ధి చెందిన భారత్ కోసం మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందని,వికసిత్ భారత్ నిర్మాణం బీజేపీ తోనే సాధ్యమని అన్నారు.ప్రజలకు బీజేపీ పై పూర్తి విశ్వాసం ఉందని,రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీలను ప్రజలను నమ్మరని అన్నారు.
మోడీ గారి ప్రభుత్వం తెలంగాణా అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని,గత పదేళ్లలో తెలంగాణా అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం 9.5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసారని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించబోతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో వివిధ మండలాల యొక్క ఎన్నికల అధికారులు బీజేపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం చేసిన

## రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..

ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 28,శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తైలాభిషేకం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేశారు.శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామంలో శంకర్ రాజు ముఖియా దేవాలయ చైర్మన్ ఆధ్వర్యంలో ఈరోజు శని త్రయోదశి సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనికి తైలాభిషేకం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,శనీశ్వర దేవుడిని ఆరాధించడం వల్ల జీవితంలో సుఖ సంతోషాలు కలుగుతాయని శనీశ్వరుడి అనుగ్రహం వల్ల మనిషికి కీర్తి, ఐశ్వర్యం లభిస్తాయి అని తెలిపారు.ఈ పూజా కార్యక్రమంలో



సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,దూడల వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్,నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్, ఘాన్సిమియా గూడ జగన్ గౌడ్,రామ్నాథ్ ముదిరాజు,తదితరులు పాల్గొన్నారు.



# సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతు భరోసా

## వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

హైదరాబాద్,డిసెంబర్ 28,ప్రజావినికిడి:
రైతు భరోసా కు సంబంధించి పెట్టుబడి సహాయం సాగులో ఉన్న భూమికి మాత్రమే అందించడం తమ ముఖ్యఉద్దేశ్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు భరోసా పథకాన్ని ఈ సంక్రాంతి నుంచి ఆరంభించే క్రమంలో భాగంగా శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రీమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయగల వివిధ కంపెనీ ప్రతినిధులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సాగు చేసిన భూములను వ్యవసాయ విస్తీర్ణాధికారుల ద్వారా ఎప్పటికప్పుడు రైతు వారి నమోదు చేయడం జరుగుతుందని, దానితో పాటు పథకం అమలులో ఖచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటాలో గ్రామాల వారీ సర్వే నెంబర్ల వారీగా సాగులో ఉన్న భూముల




విస్తీర్ణం, సాగును అనువు గాని విస్తీర్ణంతో పాటు ప్రస్తుతం ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైందీ వంటి వివరాలను రైతుభరోసా పథకం అమలుతో పాటు, భవిష్యత్తులో చేపట్టనున్న పంటల భీమా అమలుకు, అలాగే పంటల ఆరోగ్య స్థితి, పంటల ఎదుగుదల, చీడపీడలను ఆరంభములోనే గుర్తించడం, వరదలు, తుఫానుల వల్ల జరిగే పంటనష్టాన్ని అంచనా వేయడంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఈ సందర్భముగా ఈ సమావేశానికి హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధుల వారు ఆ దిశగా ఇంతకు ముందు చేపట్టిన ప్రాజెక్ట్ వివరాలతో పాటు, శాంపిల్ గా వారు చేసిన రెండు మండలాల వివరాలను పంటల వారీగా గ్రామాల వారీగా ఈ రోజు వరకు సాగైన వివరాలను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి సమక్షంలో ప్రదర్శించారు. సాగుకు అనువు గాని ప్రాంతాలను డిజిటల్ మ్యాప్స్ ద్వారా చూపించారు. పంటలలో తలెత్తే చీడపీడలను ఆరంభంలో గుర్తించేలా ఆయా కంపెనీలు ఏఐ పరిజ్ఞానంలో తయారు చేసిన మోడల్స్ ను వివరించారు. అనంతరం మంత్రి వారిని పూర్తి వివరాలలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ వీటన్నిటిని పరిశీలించి మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం మేరకు క్యాబినెట్ ఆమోదానికి పంపించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు పాటు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ నేతల సిఫార్సులకు నో

## ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఇవో

తిరుమల,డిసెంబర్ 28,ప్రజావినికిడి:
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు. మీడియాలో అలా ప్రచారం జరుగుతోందని.. కానీ తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో శ్యామల రావు వివరణ ఇచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించకపోవడంపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ టీటీడీ తీరును బహిరంగంగానే తప్పుబట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలపై




దర్శనానికి అవకాశం కల్పించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీటీడీ ఈవో శ్యామల రావు.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లీడర్ల లేఖలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

## బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి

# నిధులు మంజూరు చేయాలి..

## కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..






ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
శనివారం రోజు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఐఏఎస్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అలాగే చంపపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి,మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్ రెడ్డి తో కలిసి కలవడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి అదేవిధంగా సమస్యల పరిష్కారానికి అలాగే డివిజన్ పరిధిలో శివారు ప్రాంతంలో నూతన కాలనీలకు మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది.సాహనుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధికి అతి త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని తెలియజేయడం జరిగింది.

# కార్పొరేటర్ చోరువతో కాలనీవాసుల సమస్యకు పరిష్కారం..

ప్రజావినికిడి,(హయత్ నగర్):
హయత్ నగర్ డివిజన్ లోని అరుణోదయ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ మాన్ హెూల్స్ చెత్తాచెదారంతో నిండడం వల్ల తరచు మాన్ హెూల్స్ పొంగి దూర్వసతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని సమాచారం రావడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత సిబ్బందితో కలిసి భూగర్భ డ్రైనేజ్ మాన్ హెూల్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు కాలనీవాసులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వెంటనే భూగర్భ డ్రైనేజ్ మాన్ హెూల్స్ శుభ్రం చైయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్ బి సూపర్వైజర్ బాలు నాయక్ కు తెలపడం జరిగింది.ఈ యొక్క పరిశీలనలో అరుణోదయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# సిపియం పార్టీ రంగారెడ్డి జిల్లా 10 వ మహాసభలను జయప్రదం చేయండి..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్): యన్ టి ఆర్ నగర్ ఆర్ కే పురం డివిజన్ సిపియం పార్టీ సరూర్ నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఛలో ఇబ్రహీంపట్నం కు బయలుదేరూతున సిపియం పార్టీ నాయకులు సిపియం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యం చంద్రమోహన్ సరూర్ నగర్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్,యం. గోపినాయక్,యం. వీరయ్య కే.రాములు పర్సురాములు, యాదయ్య చైతన్య లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సంకీర్తన ఫౌండేషన్ సేవా సంస్థ 2025 సంవత్సరపు క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
శనివారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సంకీర్తన ఫౌండేషన్ సేవా సంస్థ యొక్క 2025 సంవత్సరానికి గాను నూతన క్యాలెండర్ రిలీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ముందుగా సంకీర్తన ఫౌండర్ %డ% ప్రెసిడెంట్సంతోష్ కు శు



భాకాంక్షలు తెలిపారు.ఈ సంస్థ ద్వారా గతంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు మేలు జరిగింది అని గుర్తు చేశారు.అలాగే గత కరోన సమయంలో పేద ప్రజలకు బియ్యం,కూరగాయలు మరియు నిత్యవసర సరుకులు వివిధ ఆశ్రమల్లో దుపట్లు మరియు అనాధ పిల్లలు పాఠ్య పుస్తకాలు బ్యాగ్స్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు.తప్పకుండా నా యొక్క సహాయ,సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మెగావత్ అనిత,జనరల్ సెక్రటరీ మల్లేష్ యాదవ్,హనుమంత్,సైదులు,వినోద్,కొంపల్లి దివ్య,మమత,దివ్య, గార్లు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# శతక్కొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డి

## మెల్‌బోర్న్ టెస్ట్‌లో రికార్డు శతకం



మెల్‌బోర్న్‌డిసెంబర్ 28,ప్రజావినికిడి:
తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన అతడు మెల్‌బోర్న్ టెస్టులో జట్టును ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈక్రమంలో టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో తొలి శతకం సాధించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ తొలి బంతి నుంచి నిలకడైన ఆటతీరును ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు. సుందర్‌తో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన నితీశ్ సెంచరీ సమయంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను భారత్ కోల్పోయింది. చివరి వికెట్‌గా సిరాజ్ మాత్రమే ఉన్నాడు. అప్పుడు నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌లో నితీశ్ 99 పరుగుల మీద ఉండటం.. కమిన్స్, బోలాండ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో అభిమానుల్లో ఆందోళన రేగింది. అయితే, సిరాజ్ చక్కటి డిఫెన్స్‌తో ఆడి నితీశ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. బోలాండ్ బౌలింగ్‌లో బౌండరీతో సెంచరీని పూర్తి చేశాడు. దీంతో ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డిని అభినందిస్తూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకున్నారు. నితీశ్‌తోపాటు సుందర్ (50) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొమ్మిదో స్థానంలో వచ్చిన అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. క్రీజ్‌లో పాతుకుపోయిన సుందర్ 146 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అతడి కెరీర్‌లో ఇది నాలుగో హాఫ్ సెంచరీ. సెంచరీ హీరో నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 8వ వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. నితీశ్ సెంచరీ పూర్తయ్యాక బ్యాడ్‌లైటింగ్ కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి భారత్ స్కోరు 358/9. క్రీజ్‌లో నితీశ్ (105?), సిరాజ్ (2) ఉన్నారు. ఇంకా భారత్ 116 పరుగులు వెనకబడి ఉంది. అయితే, వర్షం వచ్చేయడంతో పిచ్‌ను కవర్లతో సిబ్బంది కప్పేశారు. ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను నిలిపేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. ఇవాళ భారత్ నాలుగు వికెట్లను కోల్పోయి 193 పరుగులు రాబట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

# సాగర్ డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ భద్రత తొలగింపు

## తిరిగి ఎస్పీఎఫ్ ఆధీనంలోకి సాగర్



నాగార్జునసాగర్,డిసెంబర్ 28, ప్రజావినికిడి: :నాగార్జున సాగర్ ప్రధాన డ్యాంపై సీఆర్పీఎఫ్ భద్రత తొలగించారు. నాగార్జున సాగర్ డ్యాం తిరిగి ఎస్పీఎఫ్ ఆధీనంలోకి వచ్చింది. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాం భద్రత కేఆర్ ఎంబీ అధీనంలో ఉండటంతో సీఆర్ పీఎఫ్ బలగాలతో భద్రత నిఘాలో ఉంది.. ఇరు రాష్ట్రాల మధ్య అవగాహన రావడంతో సీఆర్పీఎఫ్ నుంచి భద్రతపరమైన చర్యలను ఎస్పీఎఫ్ అప్పజెప్పారు. బోర్డుకు ఇండెంట్ ఇస్తున్నా తెలంగాణను పదేపదే అడగాల్సి వస్తోందని..13వ గేటు నుంచి తమ వైపు ఉన్న గేట్లను తామే ఆపరేట్ చేసుకుంటామని కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. తెలంగాణ ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం 13వ క్రెస్ట్ నుంచి ఏపీ పరిధిలో మిగతా భాగమంతా తెలంగాణ పరిధిలో ఉన్నది. తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టును ఏపీ బలవంతంగా ఆక్రమించిందని తెలంగాణ కేంద్రానికి ఫిర్యాదు చేయడం వంటి పరిణామాలతో ఎన్నికల సమయంలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ క్రమంలో సమయంలో కేంద్ర బలగాలు రంగ ప్రవేశంతో కాస్త ఉద్రికత్త తగ్గింది. ఆ విషయంలో కేంద్ర హోం శాఖ, జలవనరుల శాఖలు రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, కృష్ణా బోర్డుకు చెందిన ఇద్దరు అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన కూడా చేశారు. ఐతే ఏపీ పునర్వ్యవస్థీకణ చట్టం ప్రకారం సాగర్ నిర్వహణ తెలంగాణే చూస్తుందని, కాబట్టి వెంటనే ప్రాజెక్టును అప్పగించాలని తెలంగాణ కేంద్రానికి వరుస లేఖలు రాసింది. కేంద్ర హోంశాఖ సూచించిన విధంగా 2023 నవంబర్ 28కి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగేలా చూడాలని కోరింది.

# మన్మోహన్ మరణాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది : కిషన్ రెడ్డి



హైదరాబాద్,డిసెంబర్ 28,ప్రజావినికిడి::మాజీ ప్రధాని మన్మోమన్ సింగ్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం నిరుత్సాహపరిచిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై బీజేపీ ప్రభుత్వం ఆయనను అవమానించిందని, మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు అధికారిక శ్మశాన వాటికలో చేయకుండా నిగంబోధ్ ఘాట్ వద్ద జరిపిందని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై స్పందించిన కిషన్ రెడ్డి కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం కోసం స్థలం కేటాయించబడుతుందని, ఇది మాజీ ప్రధానులందరికీ నిబంధనల ప్రకారం జరుగుతుందనిహెూంమంత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు, మన్మోహన్ సింగ్ కుటుంబసభ్యులకు తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ తన పొలిటికల్ గేమ్‌ను కొనసాగిస్తోందని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ వారి రాజవంశానికి చెందని మాజీ ప్రధాన మంత్రులైన డా. మన్మోహన్ సింగ్, పి.వి. నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలాంటి వారిని నిరంతరం మోసం చేసి, అవమానించిందని చరిత్ర చెబుతోందని విమర్శించారు. అంతేగాక కాంగ్రెస్ ఆయన మరణానికి సంతాపం వ్యక్తం చేస్తున్నప్పుడు, మన్మోహన్ సింగ్ తన సొంత పార్టీ చేతిలో చవిచూసిన అవమానాలను మనం విస్మరించకూడదని, మన్మోహన్ సింగ్ వారసత్వానికి ఈ సంతాపం కంటే ఎక్కువ అర్హత ఉందని కిషన్ రెడ్డి రాసుకొచ్చారు.

# నితీశ్ సెంచరీ..తగ్గేదేలేదంటూ స్టైల్

## తెలంగాణ సీఎం రేవంత్‌పై అంబటి మరో కామెంట్

గుంటూరు,డిసెంబర్ 28,ప్రజావినికిడి:
భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి అద్భుతం సృష్టించి శతకం బాదాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 9 ఫోర్లతో సెంచరీతో కదం తొక్కాడు. దీంతో అతడిపై ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి. అయితే, అతడు అర్ధ శతకం నమోదు చేసిన సమయంలో పుష్ప స్టైల్‌లో 'తగ్గేదేలే' అంటూ మేనరిజంతో సంబురాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అతడి పుష్ప స్టైల్ సెలబ్రేషన్స్‌పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. 'ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్న పుష్ప.. హీరోని వేధిస్తూ తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తానంటే నమ్మేదెలా



అబ్బా.. ?' అంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్ట్‌కు నితీశ్ వీడియోని కూడా షేర్ చేశారు. కాగా, సంధ్యా థియేటర్ ఘటన, అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిన కలిసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కూడా అంబటి ఓ ఆసక్తికర ట్వీట్ పెట్టారు. 'పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందే..!' అంటూ ఆయన పెట్టిన పోస్టు సంచలనం రేపింది. ఎందుకంటే.. పుష్ప-2 మూవీలో 'సోఫా' సీన్లు ఉంటాయన్న విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, అనుకూలంగా పనిచేసేవాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో పెద్ద మొత్తంలో డబ్బు ఉంచి లంచంగా ఇస్తుంటారు. ఇదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావిస్తూ.. 'సోఫా' పంపితేనే సినీ ఇండస్ట్రీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ ట్వీట్ చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. 'పుష్ప వివాదానికి.. పుష్పరాజ్ తరహాలోనే పరిష్కారమా..?' అంటూ కామెంట్ల వర్షం కురిపించారు. ఇప్పుడు మరోసారి అదే తరహా ట్వీట్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

# నితీశ్ సెంచరీకి నేతల ఫిదా

## ప్రశంసల వర్షం కురిపించిన చంద్రబాబు

అమరావతి,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:
ఆస్ట్రేలియా గడ్డపై అద్భుతమైన సెంచరీతో చెలరేగిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి మీద అన్ని వైపుల నుంచి ప్రశంసల వర్షం కురస్తోంది. కష్టకాలంలో క్రీజులోకి అడుగుపెట్టి అతడు చేసిన పోరాటం, కంగారూ బౌలర్లకు ఎదుర్కొడ్డి జట్టును ఓటమి నుంచి బయటపడేసిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు. 21 ఏళ్ల కుర్రాడు.. ఎంతో అనుభవం ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా చేయలేని పనిని చేసి చూపించడం, ఆసీస్ బౌలర్లను ఆటాడుకోవడాన్ని అంతా మెచ్చుకుంటున్నారు. నితీష్ సంచలన ఇన్నింగ్స్ మీద ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. గర్వపడేలా చేశావ్ అంటూ తెలుగోడ్ని మెచ్చుకున్నారు. సూపర్బ్ సెంచరీ సాధించిన నితీష్ రెడ్డికి చంద్రబాబు అభినందనలు తెలిపారు. టెస్టుల్లో అత్యంత పిన్న వయసులో శతకం బాదిన భారత మూడో క్రికెటర్‌గా నిలవడం గొప్ప విషయమని ప్రశంసించారు. రంజీలో ఆంధ్ర జట్టు తరఫున ఎన్నో విజయాలు సాధించిన నితీష్.. అండర్-16లో కూడా అదరగొట్టాడని గుర్తుచేశారు చంద్రబాబు. అతడు తన కెరీర్‌లో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. టీమిండియా తరఫున ఇలాగే చెలరేగుతూ దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌లో ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రులు నారా లోకేశ్, రాంప్రసాద్ రెడ్డి కూడా నితీష్‌ను మెచ్చుకున్నారు. తెలుగు వారి ప్రతిష్టను ప్రపంచ యవనికపై మారుమోగిస్తున్నందుకు అతడికి థ్యాంక్స్ చెప్పారు లోకేశ్. స్వర్ణాంధ్ర ఇలాగే సాధ్యమవుతుందని, అన్ని అడ్డంకులను దాటుకొని దూసుకెళ్తే ఏదైనా సాధ్యమేనని ట్వీట్ చేశారు. ఫాలోఆన్ ప్రమాదంలో ఉన్న భారత్‌ను అద్భుత శతకంతో ఆదుకున్నాడని రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. నితీశ్ మున్ముందు టీమిండియాకు మరిన్ని విజయాలు అందించాలని మంత్రి ఆకాంక్షించారు. తెలుగోడి సూపర్బ్ బ్యాటింగ్‌పై దిగ్గజ ప్లేయర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా స్పందించాడు. టీమ్ కష్టాల్లో ఉన్న టైమ్‌లో నితీష్ ఆడిన తీరు అద్భుతమని.. ఇది అతడికి ఆరంభం మాత్రమేనని ప్రశంసించాడు. నితీష్ బ్యాటింగ్‌లో ఉన్న పాజిటివిటీ, ఫియర్‌లెస్‌నెస్‌ను తాను ఆస్వాదించానని వీవీఎస్ తన ట్వీట్‌లో రాసుకొచ్చాడు.

# ప్రధాని మోదీని కలిసిన గుకేశ్ !

డిసెంబర్ 28,ప్రజావినికిడి:వరల్డ్ చెస్ ఛాంపియన్ గుకేశ్ నేడు ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశాడు. తాను వరల్డ్ టైటిల్ గెలుచుకునే క్రమంలో ఫైనల్లో ఆడిన చెస్ బోర్డును ప్రధానికి కానుకగా ఇచ్చాడు. దీనిపై ప్రధాని మోదీ సోషల్ మీడియాలో స్పందించారు."చెస్ ఛాంపియన్, భారతదేశపు గర్వకారణమైన గుకేష్‌తో సంభాషణ అద్భుతంగా సాగింది. నేను కొన్ని సంవత్సరాలుగా గుకేష్ తో సన్నిహితంగా సంభాషిస్తున్నాను, అతనిలో నాకు ఎక్కువగా కనిపించేది అతని సంకల్పం, అంకితభావం. అతని ఆత్మవిశ్వాసం నిజంగా స్ఫూర్తిదాయకం. వాస్తవానికి, కొన్నేళ్ల కిందటి ఓ వీడియోలో గుకేశ్ ఏం చెప్పాడో నాకు గుర్తుంది. తాను చిన్న వయసులోనే వరల్డ్ చాంపియన్ అవుతానని చెప్పాడు. తన స్వయంకృషితో దాన్ని సాధ్యం చేసి చూపించాడు." అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.కాగా, ఇటీవల సింగపూర్ వేదికగా జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో డింగ్ లిరెన్ పై గుకేశ్ అద్భుత విజయం సాధించాడు. 18 ఏళ్ల వయసులో గుకేశ్ సాధించిన ఈ ఘనత చదరంగం పండితులను సైతం ఆకట్టుకుంది.



# మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# బేబీ బంప్ ఫోటోలతో సామ్ హల్‌చల్

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.

# మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

# సిఎం మీటింగ్‌తో అపోహలు తొలగిపోయాయి

## :నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ



ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ వచ్చిందనే అపోహ సిఎంతో జరిగిమీటింగ్‌తో తొలగిపోయిందని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అది బెస్ట్ మీటింగ్ అని అక్కడికి వెళ్లినవాళ్లు నాతో చెప్పారు. ఫిల్మ్ ఛాంబర్ తరఫున మేము గతంలో ప్రభుత్వాన్ని కలిశాం. గద్దర్ అవార్డుల విషయంలో కొన్ని సలహాలిచ్చాం. గతంలో మేము కూడా కొన్ని సినిమాలకు బెనిఫిట్ షోలు వేశాం. కానీ, ఉచితంగా ప్రదర్శించాం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. దీని గురించి ప్రేక్షకులు, నిర్మాతలు ఆలోచించాలి. తాజాగా విడుదలైన 'పుష్ప2' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంటే మనం ఇప్పటికే ఇంటర్నేషనల్ స్థాయికి చేరాం. అన్ని భాషల్లో సినిమాలు తీస్తున్నాం.సీఎం మాట్లాడినట్లు సమాచారం. ఇండస్టీ వాళ్లకు గవర్నమెంట్ దగ్గరకు తరచూ వెళ్లాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడే కలుస్తాం. 'గతంలో చెన్నై నుంచి ఇండస్టీ హైదరాబాద్ రావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇక్కడి నుంచి మరోచోటకు వెళ్లాలన్నా అంత సమయమే పడుతుంది. చిరంజీవి కుటుంబం నుంచి మీటింగ్‌కు ఎవరూ ఎందుకు వెళ్లలేదో నాకు తెలియదు. బహుశా వారికి ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయేమో. ఇండస్ట్రీలో ఉన్న వారందరూ నాకు పిల్లలతో సమానం. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు సంతోషించాను. అలానే సంధ్య థియేటర్ ఘటనపై కూడా తాజాగా నా అభిప్రాయాన్ని చెప్పాను. నా ఉద్దేశం ఎవరినీ బాధపెట్టడం కాదు. నా పిల్లలతో సమానం కాబట్టి వాళ్ల గురించి మాట్లాడతాను. కొందరి మాట వింటే భవిష్యత్తు బాగుంటుంది. మరి కొందరికి దూరంగా ఉండండి అని చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటాను' అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

# భాగ్య శ్రీ సుడి తిరిగితే మాత్రం..!

సరిగ్గా ఇండస్ట్రీలో హీరోయిన్స్ కొరత ఉన్నప్పుడే ఎంట్రీ ఇచ్చిన భామ భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో యారియాన్ 2 తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు హరీష్ శంకర్ దృష్టి పడింది. దాంతో మాస్ మహారాజ్ రవితేజతో చేసిన మిస్టర్ బచ్చన్ కోసం ఎంపిక చేశారు. ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాకపోయినా సరే భాగ్య శ్రీకి మాత్రం మంచి పాపులారిటీనే తెచ్చింది. ముఖ్యంగా మిస్టర్ బచ్చన్ లో అమ్మడి గ్లామర్ షోకి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. అందుకే ఆడియన్స్ లో ఆమెకున్న ఐడెంటిటీ చూసి వరుస ఆఫర్లు ఇస్తున్నారు. షో ఇప్పటికే విజయ్ దేవరకొండ తో ఒక సినిమా చేస్తున్న భాగ్య శ్రీ ఆ సినిమాతో కచ్చితంగా హిట్ కొట్టేలా ఉంది. విజయ్ సినిమాలో హీరోయిన్స్ కి మంచి ప్రాధాన్యత ఉంటుంది. గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి ఈ మూవీపై భారీ హైప్ ఉంది. ఇక మరోపక్క దుల్కర్ సల్మాన్ తో కాంతా సినిమా కూడా చేస్తుంది భాగ్య శ్రీ. తెలుగు, తమిళ్ భాషల్లో తెరకెక్కే ఈ సినిమాతో భాగ్య శ్రీ మళ్లీ చర్చల్లో నిలుస్తుంది. అటు విజయ్, ఇటు దుల్కర్ ఇద్దరితో అమ్మడు స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. ఈ రెండిటిలో ఏ ఒక్క సినిమా హిట్ అయినా కచ్చితంగా భాగ్య శ్రీకి మంచి క్రేజ్ వస్తుందని చెప్పొచ్చు. ఇప్పటికే భాగ్య శ్రీ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాలో వేడి పెంచేస్తుంది. అటు సినిమాలు ఇటు ఫోటో షూట్స్ రెండిటిలో భాగ్యాన్ని చూసి ఆడియన్స్ వారెవా అనేస్తున్నారు. ఒక సినిమా హిట్ పడితే మాత్రం అమ్మడు టాలీవుడ్ లో టాప్ ప్లేస్ కి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పొచ్చు. ప్రస్తుతం సీనియర్ హీరోయిన్స్ అంతా సైడ్ అయిన ఈ టైం లో వచ్చిన ప్రతి ఛాన్స్ ని పర్ఫెక్ట్ గా వాడుకుంటే మాత్రం భాగ్య శ్రీ బోర్స్ కి తిరుగు ఉండదని చెప్పొచ్చు. ముఖ్యంగా అమ్మడి గ్లామర్ షోకి సెపరేట్ క్రేజ్ ఏర్పడుతుంది కాబట్టి అమ్మడు అదే రేంజ్ లో రెచ్చిపోతే ఆమె కెరీర్ కు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. ఒక్క హిట్ పడి భాగ్య శ్రీ సుడి తిరిగితే మాత్రం కచ్చితంగా మిగతా హీరోయిన్స్ కి టఫ్ కాంపిటీషన్ అవుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



# పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉర్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613